ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి 2





2 మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా





AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
20-1-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## అనుమతి లేని భవనం సీజ్

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పూసల గల్లీలో ఓ భవనాన్ని నగరపాలక సంస్థ అధికారులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మిస్తుండటంతో అడ్డుకున్నారు. పోలీసులు, నగరపాలక సంస్థ అధికారులు అక్కడ జరుగుతున్న పనులను అడ్డుకొని ఫ్లెక్సీని అంటించారు. ఇకపై నిర్మాణ పనులు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## బోధన్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం




**అక్షరటుడే, బోధన్:** బోధన్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తాగునీటి కోసం రూ.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన నీటి ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.18 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు సైతం శంకుస్థాపన చేశారు. అంతకుముందు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, పట్టణ అధ్యక్షుడు పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశంలో పసిడి ధరలు.. రూ.లక్షా యాభై వేలు దాటిన వైనం..

**అక్షరటుడే, కామారెడ్డి:** మహిళలు అత్యంత ఇష్టంగా బంగారం కొనుక్కునే పరిస్థితి చేయి దాటిపోతోంది. గత నాలుగైదు రోజులుగా రూ.1.45 లక్షల వద్ద స్థిరంగా ఉన్న బంగారం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు రూ.1,50,800 ఉన్న బంగారం ధర సాయంత్రానికి రూ.1.53 లక్షలకు చేరింది. దాంతో ప్రజలు బంగారం దుకాణాల వైపు వెళ్లాలంటే జంకుతున్నారు. వచ్చేనెలలో పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ధరలు అమాంతం పెరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది. మున్సిపల్ పీఠాలు, వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశవాహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ ఎన్నికల్లో 50 శాతం సీట్లు మహిళలకు కేటాయించారు. స్థానిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లాలోని వార్డులు, డివిజన్‌లలో సగం మహిళలకు కేటాయించారు. జిల్లాలో రెండు మున్సిపల్ పీఠాలు, ఒక మేయర్ పదవి సైతం ఈ సారి అతివలకే రిజర్వ్ అయ్యాయి.** - అక్షరటుడే, భీమ్‌గల్

# పురపోరులో మహిళల జోరు..



■ సగం స్థానాలు వారికే కేటాయింపు ■ జనరల్‌లోనూ సత్తా చాటేందుకు సిద్ధం ■ జిల్లాలో మూడు చైర్‌పర్సన్ స్థానాలు వారికే

నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పురపాలక సంఘాల్లో మొత్తం 146 డివిజన్లు/వార్డులు ఉన్నాయి. లాటరీ ప్రక్రియ ద్వారా వీటిలో సరిగ్గా 73 స్థానాలను మహిళలకు కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో మేయర్, చైర్మన్ పదవుల్లో మహిళలు తమదైన ముద్ర వేశారు. తాజా రిజర్వేషన్లతో మరింత మంది విద్యావంతులు, రాజకీయ నేపథ్యం ఉన్న మహిళలు బరిలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. అలాగే ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి సైతం మహిళ జనరల్‌కు దక్కింది. భీమ్‌గల్ మహిళ జనరల్, నిజామాబాద్ మేయర్ పీఠం సైతం మహిళకే దక్కనుంది. బోధన్ మాత్రమే జనరల్‌కు రిజర్వ్ అయింది.

### జనరల్ స్థానాల్లోనూ


రిజర్వేషన్ల ప్రకారమే కాకుండా, జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీకి సై అంటున్నారు. బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు, తమ సామాజిక వర్గాల్లో పట్టున్న మహిళలను జనరల్ స్థానాల నుంచి బరిలోకి దింపేందుకు ప్రధాన పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. దీంతో జిల్లాలో మహిళా అభ్యర్థుల సంఖ్య గతంలో కంటే గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

### ఓటు బ్యాంకులోనూ ముందంజ

ఓటర్లలోనూ మహిళలు పురుషుల కంటే ముందంజలో ఉన్నారు. జిల్లాలోని ఈ నాలుగు పురపాలక కేంద్రాల్లో కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 4,95,484 కాగా, అందులో మహిళలు 2,57,012 మంది ఉన్నారు. అంటే పురుషుల (2,38,419) కంటే మహిళా ఓటర్లే 18,593 మంది ఎక్కువగా ఉండటం విశేషం. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో మహిళా ఓటు బ్యాంకు ఉండటంతో పార్టీలు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి.

### మున్సిపాలిటీల వారీగా ఓటర్ల వివరాలు

| నగరం/పట్టణం | మొత్తం ఓటర్లు | మహిళలు | పురుషులు | ఇతరులు |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | 3,48,051 | 1,80,546 | 1,67,461 | 44 |
| బోధన్ | 69,416 | 35,720 | 33,696 | 0 |
| ఆర్మూర్ | 63,970 | 33,322 | 30,646 | 2 |
| భీమ్‌గల్ | 14,045 | 7,429 | 6,616 | 0 |



## ప్రభుత్వం నడవాలంటే సర్పంచులే పునాది రాయి: మహేష్ కుమార్ గౌడ్

**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రభుత్వం నడవాలంటే సర్పంచులే పునాది రాయి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గంలో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఈ దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. ప్రతివర్గానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందన్నారు. రాజకీయ జీవితంలో సర్పంచ్ పదవి పునాది రాయి అని, సర్పంచ్ పదవిలో రాణిస్తే భవిష్యత్తులో మంచి నాయకులవుతారని, పదవులు అవే వస్తాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించి పథకాన్ని నీరుగార్చే కుట్ర చేస్తోందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. దీనిపై ఈనెల 26న ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి బీజేపీకి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని పిలుపునిచ్చారు. దేవుణ్ణి గౌరవించడం వేరు.. దేవుని పేరుతో రాజకీయం చేయడం వేరని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో శ్రీరాముని పేరుమీద బీజేపీ ఓట్లు అడుగుతుందని, బీజేపీకి శ్రీరామునికి ఏం సంబంధం.. శ్రీరామునికి బీజేపీలో ఏమైనా సభ్యత్వం ఉందా అని ప్రశ్నించారు. అర్వింద్ ఏడేళ్లుగా ఎంపీగా ఉన్నారని.. జిల్లాకు ఏమి తెచ్చారని ప్రశ్నించారు. గ్రామాల్లో సర్పంచులు ప్రజలకు మంచి పాలన అందించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణకు ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్.. మేనేజర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ పూజారి శ్రావణి శిక్షణ నిమిత్తం వెళ్లారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో 45 రోజుల శిక్షణ నిమిత్తం మంగళవారం ఆమె వెళ్లారు. దీంతో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు తాత్కాలిక ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ సమయంలో ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ శ్రావణి శిక్షణకు వెళ్లడంపై పలువురు చర్చించుకుంటున్నారు. మేనేజర్ శ్రీనివాస్‌కే పూర్తి బాధ్యతలు అప్పగించి ఎన్నికలు నిర్వహిస్తారా... లేక మరో కమిషనర్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తారా.! అన్న చర్చ మున్సిపల్ అధికార వర్గాల్లో జరుగుతోంది.

## సెల్‌ఫోన్ సౌకర్యం మాత్రమే.. హెల్మెట్ అనేది అత్యవసరం: మంత్రి సీతక్క

**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రతి ఒక్క మనిషికి సెల్‌ఫోన్ ఒక సౌకర్యం మాత్రమేనని, హెల్మెట్ మాత్రం అత్యవసరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 300 కిలోల స్క్రాప్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన హెల్మెట్ నమూనాను మంగళవారం మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆవిష్కరించారు. అనంతరం పలువురికి హెల్మెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మనిషి జీవితం వేగంగా వెళ్తుందని, అదే వేగాన్ని వాహనం నడపడంలో కూడా చూపిస్తున్నామన్నారు. ఆ సమయంలో హెల్మెట్ లేక అనేక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని తెలిపారు. బతికుంటేనే ఏదైనా చేస్తామని, ప్రతిరోజు రూ.వేలల్లో ఖర్చు చేస్తామని, హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో హెల్మెట్ అనేది నిత్యవసరంగా మారిందన్నారు. అతివేగం ప్రమాదకరమని, ఏ రూపంలో మృత్యువు వస్తుందో తెలియదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్ ఆవిష్కరించారు.





## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పనిచేయాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో నెలవారి సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీచేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సీపీ వివరాలు తెలుసుకున్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ కోసం వివరాలు పంపాలన్నారు. అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, నిజామాబాద్ డివిజన్ సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ 80 వసంతాల వేడుకను సక్సెస్ చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** టీఎన్జీవోస్ ఏర్పడి 80ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా త్వరలో ఎల్బీ స్టేడియంలో 80 వసంతాల బహిరంగ సభ నిర్వహించనున్నట్లు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రతినిత్యం పోరాటం చేసే ఏకైక సంఘం టీఎన్జీవోస్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ బిల్స్ మంజూరు చేయించడంలో ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రతినెలా సుమారుగా రూ.750 కోట్లు జమ చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ఇప్పించుకోగలిగామని చెప్పారు. త్వరలో ఉద్యోగులకు హెల్త్ కార్డులు వస్తాయని తెలిపారు. 80 వసంతాల సభకు సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు హాజరవుతారని జగదీశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, కేంద్ర సంఘ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, పోచయ్య, అర్బన్ యూనిట్ బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఫోరం అధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## యూజీడీ పనులు ఏళ్ల తరబడి సాగితే ఎలా.. ఎంపీ అర్వింద్ అసహనం

**అక్షరటుడే, ఇందూరు :** అమృత్ పథకం కింద భూగర్భ డ్రెయినేజీ, తాగునీటి పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయని, ఇప్పటికైనా వేగంగా పూర్తి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం దిశా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో జిల్లాలో వివిధ పథకాల కింద చేపట్టిన పనులను వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. ఎంపీ లాడ్స్ నిధులను మంజూరు చేసేందుకు పలువురు కమిషన్లు డిమాండ్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని ఎంపీ అన్నారు. ఈ ధోరణి మార్చుకోవాలని హితవు పలికారు. ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పీఎం విశ్వకర్మ పథకం కింద అర్హులైన వారందరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థకు చెందిన తిలక్ గార్డెన్ వాణిజ్య సముదాయాల్లో బినామీలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, కార్పొరేషన్‌కు చెల్లించే నామమాత్రపు అద్దె సైతం ఏళ్ల తరబడిగా కట్టడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మడిగలను సబ్ లీజ్‌కు ఇచ్చి రూ.వేలల్లో తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ వివరణ ఇస్తూ.. ఈ అంశంపై సమగ్ర పరిశీలన జరిపామని, నిబంధనల కనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. పులాంగ్ వాగు నిర్వహణ గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ఎక్కడికక్కడ కబ్జాలు జరుగుతున్నాయని సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. కబ్జాదారులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని ఎంపీ అర్వింద్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వరదలకు పొలాల్లో వేసిన ఇసుక మేటలు తొలగించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, దిశ కమిటీ సభ్యులు ఆశన్న, లింగం, విజయ తదితరులు పాల్గొన్నారు.



## వేంపల్లి జాతరకు ఎంపీ అర్వింద్‌కు ఆహ్వానం



**అక్షరటుడే, మప్కాల్:** వేంపల్లిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీ అర్వింద్‌కు వేంపల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేష్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



## పని భారం తగ్గించి కార్మికులపై వేధింపులు ఆపాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021, 2025 పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని, పనిబారం తగ్గించి కార్మికులపై వేధింపులు ఆపాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఎర్ర బ్యాడ్జీలు ధరించిన ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాన్సువాడ డిపో ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వాలని నినాదాలు చేశారు. అహర్నిశలు శ్రమిస్తూ ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులు ప్రభుత్వానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెడుతున్నప్పటికీ, వారి ఆర్థిక డిమాండ్లను పట్టించుకోకపోవడం శోచనీయమని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మేడారం జాతర ముందైనా ప్రభుత్వం తీపి కబురు తెలపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు వీడీ దాస్, సంజీవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ఎంవీఐ రాహుల్ కుమార్ సూచించారు. తెలంగాణలో రోడ్డు భద్రత కోసం తెలంగాణ పోలీసు శాఖ 'అరైవ్ అలైవ్'లో భాగంగా ఆర్మూర్ పట్టణంతో పాటు 44 నెంబర్ జాతీయ రహదారిపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలు రోడ్డు మరణాలను గణనీయంగా తగ్గించడం ఈ ప్రచారం ముఖ్య లక్ష్యమన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రఘుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**అక్షరటుడే గాంధారి:** మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'మీ భద్రతే మా బాధ్యత' కార్యక్రమంలో భాగంగా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల పాటించడంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బైక్‌పై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదని సూచించారు.

ఒక్కసారి రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించి గమ్యం చేరాలని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం అందజేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ప్రజలను కోరారు. పోలీస్ కళాబృందం ఇన్‌ఛార్జి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ శేషరావు, పీసీ ప్రభాకర్, సాయిలు మాటలు-పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లపై కేజ్‌వీల్స్ తిరిగితే కఠినచర్యలు

**అక్షరటుడే, బాల్కొండ:** రోడ్లపై కేజ్‌వీల్స్ తిరిగితే కఠినచర్యలు తీసుకుంటామని బాల్కొండ ఎస్సై శైలేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేజ్ వీల్స్‌తో రోడ్లపై తిరిగితే రూ.లక్షలు వెచ్చించి వేసిన రహదారులు ఛిద్రమై వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బాల్కొండ మండల పరిధిలో ఎవరైనా కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రహదారులపై నడిపినట్లయితే, సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వాసవీ మాత ఆత్మార్పణ దినం



**అక్షరటుడే, భిక్కనూరు:** మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలోని వాసవీ మాత ఆలయంలో మంగళవారం కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికీ పంచామృతాభిషేకం అర్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వాసవి చాలీసా, లలితాదేవి సహస్ర నామావళి, లలితాదేవి స్తోత్రాలను పఠించారు. ఆర్య వైశ్య సత్రం కోశాధికారి చికోటి వెంకటేశం, అధ్యక్షుడు పురం రాజమౌళి, సత్రం సభ్యులు పబ్బ నాగరాజు, కోడిప్యాక ఆంజనేయులు, శెనిశెట్టి రాజలింగం, శెనిశెట్టి శ్రీనివాస్, కొడిప్యాక వెంకటేశం, చంద్రమౌళి, నాగర్జున, ఆగమయ్య పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. కార్మికుల ఈఎస్ఐ డబ్బులను వెంటనే చెల్లించాలని,



అలాగే ప్రభుత్వ జీవో ప్రకారం కేటగిరీ వారీగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్ కార్మికులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు అందజేశారు. స్పందించిన కమిషనర్ 20 రోజుల్లో పీఎఫ్‌కు సంబంధించిన పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు బుజ్జి, సాయిలు, కార్యదర్శి రాజు, శివరాజులు, ముక్కగళ్ల సాయిలు, అత్తర్ గంగారాం, స్వాతి, సునంద తదితరులు పాల్గొన్నారు.

## ఏకాగ్రతతో బస్సులు నడపాలి: ఎంవీఐ రాహుల్ కుమార్

**అక్షరటుడే, ఆర్మూర్:** బస్సులో నడిపేటప్పుడు డ్రైవర్ ఏకాగ్రతతో ఉండాలని ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత




మాసోత్సవాల సందర్భంగా ఆర్మూర్ ఆర్టీసీ డిపో డ్రైవర్లకు వాహన ఫిట్‌నెస్ పైన అవగాహనా సదస్సు నిర్వహించారు. డ్రైవర్ విధులకు వెళ్లేటపుడు బస్సును పూర్తిగా తనిఖీ చేసుకొని వెళ్లాలని, విధి నిర్వహణలో సెల్ వాడకూడదని సూచించారు. మూల మలుపుల వద్ద, వాహనాలు ఓవర్ టేక్ చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మైనర్లకు వాహనలు ఇవ్వరాదని, వాహనం నడిపేటపుడు హెల్మెట్, సిట్‌బెల్ట్ పెట్టుకోవాలని ఎంవీఐ సూచించారు. ఆ తర్వాత సరస్వతి విద్యామందిర్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి, డీవీఎస్ చక్రవర్తి, సరస్వతి విద్యమందిర్ హెడ్మాస్టర్ వినోద్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని కందర్‌పల్లి గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబం, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, స్థానిక మండల నాయకులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## ఇంటి వద్దకే మేడారం సమ్మక్క సారక్క ప్రసాదం



**అక్షరటుడే, బాన్సువాడ :** మేడారం వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ కార్గో ద్వారా కేవలం రూ.299కే మేడారం సమ్మక్క-సారక్క బంగారం ప్రసాదాన్ని ఇంటి వద్దకే అందిస్తామని బాన్సువాడ డిపో మేనేజర్ రవి కుమార్ తెలిపారు. బాన్సువాడ పట్టణంలోని డిపో కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు www.logistics.co.in వెబ్‌సైట్ ద్వారా లేదా సమీపంలోని ఆర్టీసీ కార్గో కౌంటర్ల వద్ద బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ ప్యాకేజీలో బంగారం (బెల్లం), పసుపు, కుంకుమతో పాటు అమ్మవార్ల ఫొటో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఇస్తారి, పంకజ్, విశ్వేశ్వర్, ఇర్ఫాన్, అలాగే బాన్సువాడ డిపో కార్గో డీఎంఈ కిశోర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే భీమ్‌గల్ మున్సిపాలిటీలో ప్రగతి

**అక్షరటుడే, భీమ్‌గల్:** మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు జె.జె. నర్సయ్య అన్నారు. మంగళవారం భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ, 10వ వార్డుల్లో టీయూఐఎఫ్‌డీసీ నిధులు రూ.3 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సహకారంతో ఈ నిధులను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు.



ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో మౌలిక వసతులు కుంటుపడ్డాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. పేదల సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే పట్టణంలో అనేక మందికి ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపాలని, పట్టణ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొచ్చి భీమ్‌గల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పర్స అనంతరావు, మాజీ కౌన్సిలర్ సీహెచ్ గంగాధర్, చెప్పల రాజన్న, చింతలూరి దశరథ్, చెప్పల నర్సయ్య, రూపాల నర్సయ్య, కాంతయ్య, సేవాలాల్, కిషన్, గంగాధర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డేవిడ్ రాజ్

**భీమ్‌గల్, అక్షరటుడే:** భీమ్‌గల మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా టి.డేవిడ్ రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ పరిధిలోని లివింగ్ క్రైస్ట్ చర్చిలో నిర్వహించిన అసోసియేషన్ సభ్యుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గత పాలకవర్గం గడువు ముగియడంతో రిక్క దేవదాస్ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.



గౌరవ అధ్యక్షుడిగా మలావత్ పరంజ్యోతి (దేవక్కపేట్), ఉపాధ్యక్షుడిగా రిక్క దేవదాస్ (ముచ్కూర్), ప్రధాన కార్యదర్శిగా మాణిక్యాల ఏలియా, కోశాధికారిగా జేమ్స్, సంయుక్త కార్యదర్శులుగా జాన్సన్, విజయ్ ప్రభు కుమార్, సలహాదారులుగా ఇశ్రాయేలు, ప్రేమ్ కుమార్, షడ్రక్ అయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డేవిడ్ రాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మండలంలోని క్రైస్తవులందరినీ సోదరులందరినీ కలుపుకుని ఐక్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, క్రైస్తవుల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దైవజనులు నోవా, సోలోమోన్, ప్రభుదాస్, జాషువా, జాకబ్, గాబ్రియేల్, రవీందర్ పాల్గొన్నారు.

## కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు



**అక్షరటుడే,మెండోరా:** మెండోరాలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 24 తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు మెండోరా ప్రెస్ క్లబ్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాస్, నవీన్, రాజు, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో 31 మందికి జైలుశిక్ష

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లా వ్యాప్తంగా పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. గత రెండు రోజుల్లో 101 మంది మందుబాబులు పోలీసులకు చిక్కారు. ఇందులో 31 మందికి కోర్టు ఒకరోజు జైలుశిక్ష విధించింది. కామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో 49 మందికి రూ.49 వేలు జరిమానా విధించగా ఇందులో 20 మందికి ఒక రోజు జైలుశిక్ష విధించింది. దేవునిపల్లి పరిధిలో 24 మందికి రూ.24 వేలు జరిమానా విధించగా ఇందులో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, తాడ్వాయి పరిధిలో ఒకరికి వెయ్యి జరిమానా, ఒకరోజు జైలుశిక్ష విధించారు. మాచారెడ్డి పరిధిలో ఐదుగురికి రూ.5వేలు జరిమానా ముగ్గురికి ఒకరోజు జైలు శిక్ష విధించింది. భిక్కనూరు పరిధిలో 14 కేసులు మందికి రూ.15 వేలు జరిమానా విధించగా ఇద్దరికి ఒకరోజు జైలుశిక్ష విధించింది. దోమకొండ పరిధిలో ఐదుగురికి రూ.5 వేలు జరిమానా ముగ్గురికి ఒక రోజు జైలుశిక్ష, బీబీపేట్ పరిధిలో ఇద్దరికి రూ.2 వేలు జరిమానా, రాజంపేట్ పరిధిలో ఒకరికి రూ.వెయ్యి జరిమానా విధించింది. జిల్లాలో గత రెండు రోజుల్లో మొత్తం 101 కేసులు నమోదు కాగా కోర్టు రూ.1.01 లక్షల జరిమానా విధించింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపవద్దన్నారు.

## విహారయాత్రకు తరలిన మోడల్ స్కూల్ విద్యార్థులు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం విజ్ఞాన విహారయాత్రకు తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం, లుంబిని పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, బిర్లా మందిర్, సెక్రటేరియట్, అంబేడ్కర్ విగ్రహం తదితర ప్రదేశాలను సందర్శించారు. వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గాంధీ, ఉపాధ్యాయులు శివకుమార్ అనిల్, కార్తీక్, కృష్ణ, స్వామి, శిల్ప, సంతోషిని, అనిత, సాయిలు తదితరులు ఉన్నారు.